క్లుప్తంగా

క్రీడా దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో బుధవారం క్రీడాకారులు, విద్యార్థులకు క్రీడా పరికరాలు, దుస్తులు పంపిణీ చేశారు. సెలవుల వేళ సెల్‌ఫోన్‌కు బానిస కాకుండా ఉండేందుకు గ్రామానికే చెందిన అంకంవార్ సాయినాథ్ క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆటల సామగ్రి అందించారు. గోవింద్, విశ్వనాథ్, శంకర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్, లింగాపూర్ గోదావరి తీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఎలగడప అంగడీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. లింగాపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయ శివరాత్రి ఉత్సవాలకు రూ.20వేలను విరాళంగా ఇచ్చిన ముడికే మల్లేశ్ కుటుంబసభ్యులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

పాఠశాలలో వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ఫ్లేర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. సిర్గాపూర్ ఫ్లేర్ ఉన్నత పాఠశాల, నర్సాపూర్(జి) అరవింద పాఠశాల, నిర్మల్ అంకుర్ ప్లే స్కూల్‌కు సంబంధించి వార్షికోత్సవ వేడుకలను ఒకే వేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి, ముత్యంరెడ్డి. ప్రిన్సిపాళ్లు సాయికిరణ్, సుష్మా, భోజారెడ్డి, కరస్పాండెంట్ నరసింహారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి పూజలు

దస్తురాబాద్:మండలంలోని గొడిసిర్యాల రాజన్న ఆలయంలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ ప్రత్యేక పూజలు చేశారు. పూజారి లక్ష్మణస్వామి తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్ల చాటున ఫర్నిచర్ తరలింపు

- గంగాపూర్ చెక్‌పోస్టు వద్ద పట్టివేత
- కేసు నమోదు చేసిన అటవీశాఖ

కడెం: ధాన్యం సంచుల మాటున అక్రమంగా ఫర్నిచర్ తరలిస్తున్న ఓ వాహనాన్ని కడెం అటవీ అధికారులు పట్టుకున్నారు. బుధవారం మండలంలోని గంగాపూర్ గ్రామం నుంచి ట్రాక్టర్ ట్రాలీ కింద భాగంలో టేకు ఫర్నిచర్ సోఫా సెట్, బెడ్లు, డ్రెస్సింగ్ టేబుల్, డైనింగ్ టేబుల్ విడిభాగాలు పేర్చి అనుమానం రాకుండా పైన ధాన్యం బస్తాలు లోడ్ చేశారు. పక్కా సమాచారం మేరకు గంగాపూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఎఫ్ఎస్‌వో కింగ్‌ఫిషర్ ట్రాక్టర్‌ను పట్టుకుని కడెం అటవీరేంజ్ కార్యాలయానికి తరలించారు. ఫర్నీచర్ విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందన్నారు. ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు కడెం ఎఫ్ఆర్ఓ గీతారాణి పేర్కొన్నారు. అనుమతి లేకుండా కలప, ఫర్నిచర్ తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హర హర మహాదేవ



లోకేశ్వరం: కన్నపూర్ బ్రహ్మేశ్వరాలయంలో..



దస్తురాబాద్ : గొడిసిర్యాల ఆలయంలో బారులు తీరిన భక్తులు



తానూరు : భోసిలోని కాశీవిశ్వనాథుడి ఆలయంలో..



సోన్ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు

మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో బుధవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు చేపట్టారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించగా ప్రజలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు క్యూలైన్లలో బారులు తీరగా నిర్వాహకులు తాగునీరు, పండ్లు అందించారు. గోదావరి తీరం వద్ద ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దిలావర్‌పూర్ మండలం కదిలి పాపహరేశ్వర ఆలయంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కుటుంబసమేతంగా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా, బాసర సర్కిల్ సీసీఎఫ్(చీఫ్ కన్జర్వేటివ్ ఆఫీసర్) శర్వనన్ ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కుంటాల: ఓలాలో కల్యాణం తిలకిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



భైంసారూరల్: సిరాలలో బారులు తీరిన భక్తులు



సర్సాపూర్(జి): నందన్ శివాలయంలో..



మామడ: బూరుగుపల్లి శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు



నిర్మల్ బాగులవాడ శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



ముధోల్ పశుపతినాథ్ ఆలయంలో శివపార్వతుల కల్యాణ సమయంలో భక్తులకు తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు



కుభీర్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఖానాపూర్: దిలావార్‌పూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



లక్ష్మణచాందా: బాబాపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయం వద్ద కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



సారంగాపూర్: వైకుంఠాపూర్ ప్రభులింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నిర్మల్‌లోని బాగులవాడ శివాలయంలో..



నిర్మల్‌లోని వెంకటాద్రిపేట ఓంకారేశ్వర ఆలయంలో..



దిలావర్‌పూర్ కదిలి పాపహరేశ్వర ఆలయంలో..



సీసీఎఫ్ శర్వనన్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

నిధులు రాక నిలిచిన పనులు

- అసంపూర్తిగా జామ్–బోరింగ్‌తండా, జామ్–మహవీర్‌తండా రోడ్లు
- దుమ్ము, ధూళితో ప్రజలకు ఇబ్బందులు
- వంతెనలు నిర్మించాలని వేడుకోలు

సారంగపూర్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని విధంగా మారింది సారంగపూర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు దుస్థితి. సారంగపూర్ మండలంలోని ఆరు కిలోమీటర్ల మేర జామ్–బోరింగ్‌తండా మట్టి రోడ్డు, మూడున్నర కిలోమీటర్ల మేర జామ్–మహవీర్‌తండా మార్గంలో ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మలిచేందుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో 2024 అక్టోబరు 22న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 3.20కోట్లతో జామ్–బోరింగ్‌తండా రోడ్డును, రూ.3 కోట్లతో జామ్–మహవీర్‌తండా మార్గంలో చేపట్టే రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కానీ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ జామ్–బోరింగ్ తండా, జామ్–మహవీర్‌తండా రోడ్డు మార్గాల్లో మొరం పోయించారు. ఆ తర్వాత నిధులు రాలేదనే కారణంగా పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ఈ రెండు మార్గాల్లో దుమ్ము, ధూళి లేస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆగమేఘాల మీద వచ్చి భూమిపూజ చేసిన పాలకులు, అధికారులు ప్రస్తుతం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.



బోరింగ్‌తండా- జామ్ సమీపంలో రోడ్డు దుస్థితి

ప్రమాదకరంగా వంతెన..

మండలంలోని జామ్ గ్రామ సమీపంలో బోరింగ్ తండాకు వెళ్లే దారిలో స్వర్ణ ప్రాజెక్టు కుడి కాల్వపై ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఈ వంతెనకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు కూలిపోయి రోడ్డుకు సమాన ఎత్తులో ఉంది. రాత్రి ఈ వంతెనను గమనించకపోతే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. గతంలోనూ ఇందులో పశువులు పడిపోయి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.

వంతెనలు నిర్మించకపోతే వృథాయే..

మహవీర్ తండాకు వెళ్లే దారిలో కోమటిచెరువు అలుగు ప్రవహిస్తూ ఉంటుంది. వర్షాకాలంలో ఈ చెరువు నిండుకుంటే ఈరహదారిపై ప్రయాణం సాధ్యం కాదు. అలుగుపై వంతెన నిర్మించి బీటీ రోడ్డు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు. లేదంటే రోడ్డు వేసినా ఫలితం ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి రోడ్ల పనులు చేపట్టడంతోపాటు బోరింగ్‌తండాకు వెళ్లే దారిలో, హనుమాన్‌తండాకు వెళ్లే దారిలో వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మహవీర్‌తండా వెళ్లే దారిలో మొరం రోడ్డు..

తాత్కాలికంగా నిలిచిపోయాయి

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతోనే జామ్–బోరింగ్‌తండా, జామ్–మహవీర్‌తండా రోడ్ల పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. నిధులు విడుదల కాగానే పనులు మళ్లీ ప్రారంభమవుతాయి. వంతెనలు నిర్మించే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. త్వరలోనే పనులు జరిగేలా చూస్తాం.

– అంజనేశ్వర్, ఏఈ, ఆర్అండ్‌బీ

నేడు అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

- సూర్యాపూర్‌లో 58 ఏళ్లుగా నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కుంటాల: శివరాత్రి పండుగ పురస్కరించుకుని 58 ఏళ్లుగా మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నారు. నేడు(గురువారం) నిర్వహించే పోటీలకు మైదానంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాజరాజేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లె మహేశ్ తెలిపారు. ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుస్తీ పోటీలకు నిలయం..

మండలంలోని సూర్యాపూర్‌లో గతంలో ఓలా గుర్రప్ప చౌకీదారు (అప్పటి అటవీశాఖ అధికారి), తిప్పే గజ్జారాంలు కలిసి 58 ఏళ్ల కిందట కుస్తీ పోటీలకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు నిజామాబాద్, కరీంనగర్, కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి మల్లయోధులు వచ్చి పోటీల్లో తలపడతారు. మొదట్లో కుస్తీ పోటీల్లో నెగ్గిన ప్రథమ విజేతకు రూ.100 నగదు అందించగా.. ప్రస్తుతం రూ. 5వేలను, వెండి కడియం బహుమతిగా అందిస్తున్నారు.



పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు (ఫైల్)

చేను చుట్టూ.. చీర కట్టూ



విత్తనం నాటినప్పటినుంచి దిగుబడి చేతికందే వరకు పంటను కంటికిరెప్పలా కాపాడుకుంటాడు రైతు. కడెం మండలంలోని పెద్దబెల్లాల్ సమీపంలో మొక్కజొన్న పంటను పందులు, కోతులు ఇతర జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు ఓ రైతు ఇలా పంట చుట్టూ కట్టిన చీరలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. – కడెం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

సోన్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు సోన్ ప్రిసైడింగ్ ఆఫీసర్ రవీందర్ బుధవారం తెలిపారు. సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం–55, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం–87లో తమ ఓటును ఓటర్లు వినియోగించుకోవాలని కోరారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు–591, ఉపాధ్యాయ ఓటర్లు–44 ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం సూచించిన 10రకాల గుర్తింపు కార్డులలో ఏదైన ఒక కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రానికి అధికారులు బుధవారం సాయంత్రం ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. ఈకేంద్రంలో 528 మంది పట్టభద్రులు, 57 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

సారంగపూర్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్న నేపథ్యంలో మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి బుధవారం సిబ్బంది చేరుకున్నారు. సిబ్బందికి భోజనం, తదితర వసతులను పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుందని ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు తెలిపారు.

ఖానాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో మూడు పోలింగ్ బూత్‌లలో ఈ మేరకు ఏర్పాట్లను చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఆధ్వర్యంలో పలు సౌకర్యాలు కల్పించారు. కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో సునీత, తహసిల్దార్ సుజాత తదితరులు పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్నారు.

దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. ఈ బూత్‌లో 43 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు, 529 పట్టభద్రుల ఓట్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని రిటర్నింగ్ అధికారి యాదవ్‌రావు పేర్కొన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 639 మంది పట్టభద్రులైన ఓటర్లు, 50 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని పీవో లచ్చిరాం తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

దస్తురాబాద్:మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై శంకర్ పరిశీలించారు. ఈ కేంద్రం పరిధిలో 299 ఓట్లు ఉన్నాయి.



సోన్‌లో ఎన్నికల సామగ్రితో సిబ్బంది



దిలావర్‌పూర్‌లో..



సారంగపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది



ఖానాపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు